క్లుప్తంగా

నిత్యాన్నదాన పథకానికి విరాళం



తిరుమలగిరి(జగ్గయ్యపేట): స్థానిక వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి భక్తుడు విరాళం అందజేశారు. శనివారం ఆలయ ఏసీ దాసరి శ్రీరామవరప్రసాదరావుకు రూ.25,116 విరాళంగా అందజేశారు. చిలుకూరు మండలం, కట్టుకొమ్ముగూడెంకు చెందిన గన్నా గురవయ్య తన తండ్రి జ్ఞాపకార్థం విరాళాన్ని అందజేశారని ఏసీ చెప్పారు. దాతలకు ప్రత్యేక పూజల అనంతరం స్వామి ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పసుపులేటి రాదాసుబ్రహ్మణ్యం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు



కంచికచర్ల : మండలంలోని గండేపల్లి రక్షిత మంచినీటి పథకం ద్వారా సరఫరా అవుతున్న తాగునీటి ప్రధాన పైప్‌లైన్‌ను మరమ్మతు పనులు శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచి బొక్కా రవికుమార్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి రక్షితమంచినీటి పథకం ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ఏళ్ల తరబడి తాగునీరు సరఫరా కాని ఇళ్లను గుర్తించి వారికి ప్రతిరోజు తాగునీరు సరఫరా అయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామంలో డ్రెయినేజీల్లో మురుగునీరు పారుదల కోసం శానిటేషన్ పనులు చేపట్టామని వివరించారు. పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల రక్షణకు భరోసా చైల్డ్‌లైన్

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఆపదలో ఉన్న బాలల రక్షణకు భరోసాగా చైల్డ్‌లైన్-1098 ఉంటుందని జిల్లా బాలల సంరక్షణ అధికారి వై.జాన్సన్ అన్నారు. కృష్ణలంకలోని పొట్టి శ్రీరాములు నగర పాలక సంస్థ పాఠశాల ఆవరణంలో చైల్డ్‌లైన్-1098, ఫోరం ఫర్ చైల్డ్‌రైట్స్ ఆధ్వర్యంలో శనివారం సచివాలయ మహిళా పోలీసు సిబ్బంది, మహిళా శిశు సంక్షేమ శాఖ సహకారంతో ఓపెన్ హౌస్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా జాన్సన్ మాట్లాడుతూ బాలలందరూ ఆనందంగా ఉండే సమాజాన్ని, బాల్య వివాహాలు లేని సమాజాన్ని అందరూ కలిసి నిర్మించుకోవాలన్నారు. ఆపదలో ఉన్న బాలల రక్షణకు చైల్డ్‌లైన్-1098 టీం చేస్తున్న సేవలను అభినందించారు. బాలలు ఆపదలో ఉంటే వెంటనే చైల్డ్‌లైన్-1098కు గానీ, 100కు గానీ, 112కు గానీ, ఉమెన్ హెల్ప్‌లైన్ 181కు గానీ ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. చైల్డ్‌లైన్ జిల్లా కో ఆర్డినేటర్ ఆరవ రమేష్ మాట్లాడారు. బర్డ్స్ ఎన్‌జీవో సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ మాట్లాడుతూ బాలలు చదువు ద్వారానే జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోగలరని తెలిపారు.

పెన్షనర్ల ఈకేవైసీ నిర్వహణకు శిబిరాలు

నందిగామ: పెన్షనర్లు ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేసేందుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు నందిగామ ఉప ఖజానా అధికారి కాకాని నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల నేపథ్యంలో ఉద్యోగులు, పెన్షనర్లు తప్పనిసరిగా సీఎఫ్ఎంఎస్ ఐడీలను ఆధార్‌కు లింకు చేసిన మొబైల్ నంబర్‌కు అనుసంధానం చేసుకోవాలని నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటికే ఉద్యోగులవి అనుసంధానం చేసే కార్యక్రమం దాదాపుగా పూర్తయిందన్నారు. ఎవరైనా ఉంటే వెంటనే చేయించుకోవాలన్నారు. ఈ ప్రక్రియ మే 10 లోగా పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో పెన్షనర్ల సౌలభ్యం కోసం నందిగామ కార్యాలయ పరిధిలోని మూడు మండలాల్లో ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మే ఒకటో తేదీన పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో, 2న పెనుగంచిప్రోలులోని మండల పరిషత్ కార్యాలయంలో, 3న చందర్లపాడు లోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆయా మండలాల్లో పెన్షనర్లు సంబంధిత రోజులలో వచ్చి ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయించుకోవాలన్నారు. క్యాంపునకు వచ్చేటప్పుడు ఆధార్‌కు లింకై న ఫోన్‌ను వెంట తెచ్చుకోవాలని సూచించారు.

రక్తహీనత నివారణ మందుల పంపిణీ

జి.కొండూరు: మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో రక్తహీనత నివారణకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను వైద్యాధికారులు శనివారం పంపిణీ చేశారు. వెల్లటూరు ఎంపీయూపీ పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేసిన వైద్యాధికారులు, వేసవి సెలవులకు సరిపడా మాత్రలను విద్యార్థినుల తల్లిదండ్రులకు అందజేశారు. ఎంపీడీఓ అనూరాధ, తహసీల్దార్ రోహిణీదేవి, డాక్టర్ శ్రీకళ్యాణి మాత్రలను అందజేశారు.

'జగనన్నే మా భవిష్యత్తు' విజయోత్సవ ర్యాలీ

- పేటలో జోష్‌ను నింపిన ర్యాలీ
- బైక్ ర్యాలీలో వందలాది మంది యువత
- ర్యాలీని ప్రారంభించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఉదయభాను



పేటలో 'జగనన్నే మా భవిష్యత్తు' విజయోత్సవ ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: 'జగనన్నే మా భవిష్యత్తు' అంటూ జగ్గయ్యపేట పట్టణంలో పార్టీ యువత చేసిన నినాదాలు మారుమోగాయి. 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం ముగింపు సందర్భంగా పట్టణంలో శనివారం పార్టీ నియోజకవర్గ యువనేత సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ స్థాయిలో ర్యాలీ ఉత్సాహంగా సాగింది. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను నివాసం నుంచి బయలుదేరి బైక్ ర్యాలీలో వందలాది మంది పార్టీ యువకులు, నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఈ ర్యాలీ సాగింది. పలు కూడళ్లలో బాణ సంచా కాలుస్తూ సందడి చేశారు. విజయవాడ రోడ్‌లోని వైఎస్ సర్కిల్ వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహంతో పాటు పలు కూడళ్లలోని వైఎస్సార్ విగ్రహాలకు యువనేత వెంకటకృష్ణప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 7వ తేదీన ప్రారంభమైన మా నమ్మకం నువ్వే జగన్ మెగా పీపుల్స్ సర్వేలో 7 లక్షల మంది పార్టీ సైనికులు ప్రతి ఇంటిని సందర్శించారని తెలిపారు. ప్రజలు వారికోసం, వారి పిల్లల భవిష్యత్ కోసం ఎవరిని విశ్వసిస్తున్నారనే అంశంపై ప్రజల అభిప్రాయాన్ని స్వీకరించడం జరిగిందన్నారు. ఈ మెగా పీపుల్స్ సర్వేలో 1 కోటి 45 లక్షల కుటుంబాలకు పైగా పాల్గొన్నారని, 1 కోటి 10 లక్షలు మిస్డ్ కాల్స్ రావడం గొప్ప విశేషమన్నారు. వీటన్నింటిని చూసి ప్రతిపక్షాలకు నిద్రపట్టడం లేదని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలందరూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, హఫీజున్నీసా ఫిరోజ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, పట్టణ సచివాలయాల కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్ర, పెనుగంచిప్రోలు మండల సచివాలయాల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, వివిధ మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, గ్రామాల సర్పంచ్‌లు, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

ఉక్కు కళావేదిక నిర్వహణ వేలం రద్దు

- కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ రాఘవేంద్ర
- మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం





వేలంపాట రద్దుకు ఓటింగ్‌లో మద్దతు తెలియజేస్తున్న సభ్యులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేట అర్బన్: పట్టణ నడిబొడ్డున ఉండి పురపాలక సంఘానికి ఎక్కువ ఆదాయ వనరుగా ఉన్న ఉక్కు కళావేదిక నిర్వహణ హక్కులకు నిర్వహించిన వేలం పాటను రద్దు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. శనివారం మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో చైర్మన్ రాఘవేంద్ర అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది. 27వ తేదీన జరిగిన ఉక్కు కళావేదిక వేలంలో ముందుగా అనుకున్న ఒప్పందం మేర మున్సిపాలిటీకి తక్కువ ఆదాయం వచ్చేలా ముగ్గురు వ్యక్తులు రింగ్‌గా ఏర్పడి తక్కువకు వేలం పాట పాడారని వట్టెం మనోహర్ సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ వేలంపాటను రద్దు చేయాలని కోరారు. దీనిపై ప్రతిపక్ష సభ్యులు కె.రామలక్ష్మి, పేరం సైదేశ్వరరావు, అలేఖ్య, వెంకట్ తదితరులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ వాదనకు దిగారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతిపక్ష సభ్యులు వేలం పాడిన వారి కోసం ఎందుకు పోరాటం చేస్తున్నారు, దీనిపై ఓటింగ్ పెడితే తప్పేంటన్నారు. దీనిపై చైర్మన్ మరలా వేలం ఏ విధంగా పెట్టాల్సి ఉంటుందని ఆర్వో రత్నాంజలిని వివరణ కోగా ఏ ధర వద్ద ఆగిందో అదే ధర పెంచడానికి మాత్రమే వేలం పాట పెట్టాల్సి ఉంటుందన్నారు. దీనిపై చైర్మన్ ఓటింగ్ ప్రతిపాదన చేయడంతో పాటను రద్దు చేయాలని మెజార్టీ సభ్యులు చేతులెత్తి తమ మద్దతు తెలిపారు. చైర్మన్ మాట్లాడుతూ మెజార్టీ సభ్యుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని ఈనెల 27న జరిగిన వేలంపాటను రద్దు చేస్తున్నట్లుగా మినిట్స్ బుక్‌లో రాశారు.

ఇంజినీరింగ్ సిబ్బంది నిర్లక్ష్యంతో..

మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ మాట్లాడుతూ వార్డుల్లో బోరు పంపులు మరమ్మతులు చేయించకపోవడం ఇంజినీరింగ్ సిబ్బంది నిర్లక్ష్యమేనన్నారు. దీంతో మరమ్మతులు వెంటనే ప్రారంభించాలని ఏఈని చైర్మన్ ఆదేశించారు. పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉంటుందని పాలకవర్గ సభ్యుడు మనోహర్ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వివరణ ఇవ్వాల్సిందిగా చైర్మన్ ఏఈ ను కోరారు. ఆయన మాట్లాడుతూ మీటింగ్ అయిన తరువాత రిపోర్టు ఇస్తానని తెలిపారు.

సమస్యల ప్రస్తావన..

మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా, పాలకవర్గ సభ్యులు సామినేని వెంకటకృష్ణప్రసాద్, గింజుపల్లి వెంకట్రావు, పందుల రోశయ్య, పాకలపాటి సుందరమ్మ, కాశి అనురాధ, ఖాదర్‌బాబు, ప్రతిపక్ష సభ్యులు రామలక్ష్మి, సైదేశ్వరరావు, వెంకట్, గీతారాణి, తదితరులు పలు సమస్యలను ప్రస్తావించారు. ఏజెండాలోని 53 అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. వైస్ చైర్మన్ హఫీజున్నీసా, కమిషనర్ సీహెచ్.మల్లేశ్వరరావు, అందరు కౌన్సిలర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రజల మద్దతు వైఎస్సార్ సీపీకే

- పీపుల్స్ సర్వేలో తేటతెల్లం
- ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: ప్రజల మద్దతు వైఎస్సార్ సీపీకే ఉందని జగనన్న సైన్యం నిర్వహించిన పీపుల్స్ సర్వేలో తేటతెల్లమైందని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో శనివారం రాత్రి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ 'జగనన్నే మా భవిష్యత్తు' పేరుతో నిర్వహించిన మెగా పీపుల్స్ సర్వేకు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందన్నారు. ప్రజల ఆశీస్సులతో గృహ సారథులు, వలంటీర్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. జగనన్న సైనికులు నియోజకవర్గంలోని సుమారు 90,450 కుటుంబాలను కలిసి ప్రభుత్వ పథకాలు, సీఎం జగన్ చేసిన మంచిని వివరించారని చెప్పారు. చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీల నిర్వాకంతో సంక్షేమ పథకాలు అందక అర్హులు అవస్థలు పడితే జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వలంటీర్ వ్యవస్థతో అర్హులకు సంక్షేమ పథకాలు అందించామని జగన్‌మోహనరావు పేర్కొన్నారు. ప్రజల వద్దకు వెళ్లి మేం చేసిన మంచిని వివరించటం గర్వంగా ఉందన్నారు. సీఎం జగన్‌కు ప్రజా మద్దతు మెండుగా ఉందని, ఇప్పటికే పలు జాతీయ స్థాయి సర్వేలు చెబుతున్నాయన్నారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీపుల్స్ సర్వే కూడా జగన్‌కు మద్దతు అని చెప్పాయన్నారు.

60 శాతం మేర గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి..

నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో 60 శాతం మేర గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి చేసినట్లు జగన్‌మోహనరావు తెలిపారు. ఇళ్లకు వెళ్తుంటే ప్రజలు ఆప్యాయంగా పలకరిస్తున్నారని చెప్పారు. ఒకటి రెండు చోట్ల టీడీపీ వారు కావాలని సంబంధం లేని ప్రశ్నలడిగి దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రజలకు నిజా నిజాలు తెలుసని ఎవరెన్ని కుయుక్తులు పన్నినా ప్రజా మద్దతు వైఎస్సార్ సీపీకే నని స్పష్టం చేశారు. ఎంపీపీ అరిగెల సుందరమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు గాదెల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల, పట్టణ కన్వీనర్‌లు ఆవుల రమేష్, మంచాల చంద్రశేఖర్, నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్‌బాబు, కందుల నాగేశ్వరరావు, బొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, వైఎస్ఎన్ ప్రసాద్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

నందిగామ: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తప్పవని ఎస్ హెచ్ ఓ సతీష్ హెచ్చరించారు. పట్టణ పరిసర ప్రాంతాల్లో శనివారం రాత్రి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పలువురిని అదుపులోకి తీసుకున్నారు. చందాపురం గ్రామంలో పలు అంశాలపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎస్ఐలు పండు దొర, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం



పెనుగంచిప్రోలు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని సర్పంచ్ వేల్పుల పద్మకుమారి అన్నారు. శనివారం స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డబ్బులు లేక ఏ విద్యార్థి చదువుకు దూరం కాకూడదని అమ్మ ఒడి పథకం ద్వారా తల్లుల ఖాతాలో రూ.15 వేలు జమచేస్తున్నారన్నారు. ప్రభుత్వం సూచించిన విధంగా వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్ఎం కె.జలజ, మండల పరిషత్ కార్యాలయ ఏఓ సిద్ధారెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బత్తుల వెంకటనర్సు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

కమిషనర్ డాక్టర్ జయరాం



స్థానికులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం

నందిగామ: వేసవి నేపథ్యంలో సైతం పట్టణ వాసులకు మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. పట్టణంలోని 15వ వార్డులో శనివారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను, స్థానిక బోరు పంపులలోని నీటి నాణ్యతను పరిశీలించారు. వార్డు ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అన్ని ప్రాంతాలకు తాగు నీరందేలా చూస్తామన్నారు. పట్టణ పరిధిలో ఉన్న అన్ని బోరు పంపులకు మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. బోర్ పంపులలో నుంచి వచ్చే నీటి నాణ్యతను కూడా ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

నందిగామ: విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం అన్నారు. పట్టణంలోని 17వ వార్డు పరిధిలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్యశాఖ ద్వారా అందిస్తున్న ఐరన్, ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్లను శనివారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలన్న ఆలోచనతో ఆరోగ్యశాఖ ద్వారా రక్తహీనతను నివారించేందుకు అందజేస్తున్న ట్యాబ్లెట్లను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. పలువురు ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని చందాపురం లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎంఈఓ బి. బాలాజీ, ఎంపీడీవో శ్రీనివాసరావు చేతుల మీదుగా ఐరన్ టాబ్లెట్లను అందజేశారు. లింగాలపాడు వైద్యాధికారిని డాక్టర్ నవీన పాల్గొన్నారు.

బీరు సీసాతో దాడి.. వ్యక్తికి గాయాలు

నూజివీడు: బీరుసీసాతో దాడి చేసిన సంఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసులు, సేకరించిన వివరాల ప్రకారం.. పట్టణంలోని స్టేషన్‌తోటకు చెందిన నంద్యాల రాజు(32) గొడుగువారిగూడెం రోడ్డులోని ఇళ్ల స్థలాల్లో శనివారం సాయంత్రం తన స్నేహితులతో కలిసి క్రా బిళ్ల ఆడుకుంటున్నాడు. అదే సమయంలో గాంధీనగర్‌కు చెందిన గణేష్ అనే అతను వచ్చి రాజుపై దాడి చేశాడు. ఈ క్రమంలో చేతిలో ఉన్న బీరు సీసాతో గణేష్ కొట్టడంతో రాజు తలకు తీవ్రంగా గాయమైంది. ఈ ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ పురుగు మందులపై ఫిర్యాదు

తిరువూరు: నకిలీ పురుగు మందులు వినియోగించి దాళ్వా ధాన్యం దిగుబడి తగ్గి నష్టపోయామని గంపలగూడెం మండల రైతులు శనివారం ఎమ్మెల్యే రక్షణనిధికి ఫిర్యాదు చేశారు. స్థానిక నియోజకవర్గ కార్యాలయంలో గంగదేవిపాడు, అమ్మిరెడ్డిగూడెం గ్రామాల రైతులు అమ్మిరెడ్డిగూడెంలోని ఒక దుకాణంలో కొన్న కోరాజిన్ మందును పిచికారీ చేసి నష్టపోయామన్నారు. ఇటీవల స్పందన కార్యక్రమంలో కూడా తాము అధికారులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. పురుగుమందుల కంపెనీపై చర్యలు తీసుకోవడంతో పాటు పరిహారం ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

పారదర్శక పాలనకు సీఎం జగన్ శ్రీకారం

- ఎమ్మెల్యే జగన్‌మోహనరావు
- కొడవటికల్లులో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: గత ప్రభుత్వాలు చేసిన నయవంచన పాలనకు చరమగీతం పాడి ప్రజా విశ్వసనీయ, పారదర్శక పాలనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడు మండలం కొడవటికల్లు గ్రామంలో శనివారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. లబ్ధిదారులకు సమకూరి సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ గత ప్రభుత్వాల మాదిరిగా ఎన్నికలకు ముందుకు పథకాలు అందించి చేతులు దులిపేసుకునే పద్ధతి తమది కాదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారన్నారు. ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పిస్తున్నారని చెప్పారు. అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే లక్షల సంఖ్యలో ఉద్యోగాలు కల్పించి నిరుద్యోగులకు అండగా నిలిచిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో ప్రతి ఒక్క అర్హుడిని గుర్తించి వారి ఇళ్ల వద్దనే సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు మంచి చేయటమే లక్ష్యంగా పని చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చావల రవిబాబు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, కందుల బుచ్చిరామయ్య, జంపాని నాగేశ్వరరావు, వేగినేడి సుబ్బారావు, శ్రీనివాసరావు, వలంటీర్‌లు, సచివాలయ ఉద్యోగులు, నాయకులు పాల్గొన్నారు.

ఉత్తేజాన్ని నింపిన 'జగనన్నే మా భవిష్యత్తు'

ప్రభుత్వ విప్ ఉదయభాను



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఉదయభాను, పక్కన ఏఎంసీ చైర్మన్ విజయశేఖర్ తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతనుత్తేజాన్ని నింపిందని, అలాగే ప్రజల్లో జగన్‌పై ఉన్న అభిమానాన్ని నిర్మోహమాటంగా బయటపెట్టిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. 'జగనన్నే మా భవిష్యత్తు', మా నమ్మకం నువ్వే జగన్, కార్యక్రమం జగ్గయ్యపేట నియోజకవర్గంలో విజయవంతంగా ముగిసిన సందర్భంగా శనివాయం ఆయన స్థానిక మార్కెట్ యార్డు కార్యాలయంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలకు జగన్‌పై నమ్మకం పెరిగిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి లాగా పేదరికమే అర్హతగా సంక్షేమ ఫలాలను అందజేసిన సీఎంను గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. తన పాలనలో 4 ఏళ్లు పూర్తిచేసుకున్న జగన్‌మోహన్‌రెడ్డి ఈ రోజు చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ఈ రాష్ట్రంలో కోటి 45 లక్షల మంది కుటుంబాలను పలకరించి, వారితో పార్టీ శ్రేణులు పథకాలు అందుతున్నాయా లేదా అని అడుగుతుంటే వారు నవ్వుతూ స్వాగతం చెపుతున్నారని తెలిపారు. గతంలో నాయకులు ప్రజల ఇళ్లను సందర్శించినపుడు సమస్య గురించి ఎదురుదాడి చేసేవారని, కాని నేడు అందుకు విరుద్ధంగా పరిస్థితులు మారాయని తెలిపారు. జగన్ పాలనపై మిస్డ్ కాల్ ఇవ్వాలని అడిగినపుడు కోటికి మందికి పైగా కాల్స్ వచ్చాయని తెలిపారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమం..

స్వాతంత్ర్యానంతరం పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే అన్నారు. గతంలో చంద్రబాబునాయుడు ప్రభుత్వంలో పచ్చచొక్కాల వారికి, జన్మభూమి కమిటీలు సూచించిన వారికే పథకాలు వచ్చేవన్నారు. ఈరోజు గడప గడపకు పథకాలే అని గర్వంగా చెపుతున్నామన్నారు. ఎవరికైనా పథకాలు అందకుంటే ఎందుకు అందలేదని అధికారులను నిలదీసేలా మరలా ఈ ప్రభుత్వంలో వెసులుబాటు కల్పించారన్నారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం పూర్తిగా విజయవంతం అయిందని, మా నమ్మకం నువ్వే జగనన్న అనే దానికి నిజంగా పూర్తిగా అర్థాన్ని ఇచ్చిందన్నారు. సమావేశంలో మార్కెట్ యార్డు చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, పేట పట్టణ, మండలాల సచివాలయాల కన్వీనర్లు తుమ్మేపల్లి నరేంద్ర, జానకీరామయ్య, పెనుగంచిప్రోలు మండల సచివాలయాల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, నాయకులు గింజుపల్లి శ్రీనివాసరావు, ఇశ్రాయేలు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబు

- రేపటి నుంచి చిట్టేల వెంకన్న ఆలయ బ్రహ్మోత్సవాలు
- హాజరు కానున్న ప్రముఖులు



బ్రహ్మోత్సవాలకు సిద్ధమైన ఆలయం

చిట్టేల(వత్సవాయి) : మండలంలోని చిట్టేలలో శ్రీ దేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం ద్వాదశ వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. మే 1 నుంచి 8 వరకు ఈ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల వివరాలను ఆలయ నిర్మాణ ధర్మకర్త మారెళ్ల పుల్లారెడ్డి శనివారం వెల్లడించారు. 1న సుప్రభాత సేవ, తోమాలసేవ, గోపూజ, శ్రీవారి పంచామృత అభిషేకం, యాగశాల ప్రవేశము, 2న పుణ్యావాహచనము, భేరిపూజ, సంతానము లేనివారికోసం గురుడా ప్రసాదం అందజేత 3న పల్లకీ ఉత్సవము, ఉత్సవమూర్తులకు విశేషస్నపన, ఉంజల్‌సేవ, శ్రీవారి కల్యాణోత్సవము, 4న యాగశాల కైంకర్యములు, సూర్యప్రభవాహనసేవ, వాహన సమర్పణ, ఏకాంతసేవ, 5 న పాలపంగళ్ల సమర్పణ, ప్రభంజనోత్సవం, గ్రామ దేవతలకు జలబిందెలు, చక్రస్నానము, పవళింపుసేవ, 6న శ్రీశ్రీశ్రీ త్రిదండి అహోబిలం జీయర్‌స్వామివారి అనుగ్రహబాషణ 7న స్వామివారికి అమ్మవారికి అష్టబందనం, మహాశాంతి తిరుమంజనం, 8న శ్రీశ్రీశ్రీ హంపీ పీఠాధిపతులు అనుగ్రహభాషణ, పుష్పాయాగం, ఏకాంత సేవ అనంతరం తీర్థ ప్రసాదాలు వినియోగంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

హాజరు కానున్న ప్రముఖులు..

ఈ బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఏవీ రమణదీక్షితులు టీటీటీ గౌరవ సలహాదారులు శ్రీ పీఠం వ్యవస్థాపకులుశ్రీ పరిపూర్ణనందస్వామి వార్లు పాల్గొంటారని తెలిపారు. తిరుమలకు చెందిన దీవి బాలాజీ రంగాచార్యులు ఆధ్వర్యంలో పూజాకార్యక్రమాలు జరుగుతాయి.

బంగారం చోరీ కేసులో మహిళల అరెస్ట్

ఇబ్రహీంపట్నం: కొండపల్లిలోని ఓ జ్యూయలరీ షాపులో ఈ నెల 26న చెవి దిద్దులు చోరీ చేసిన కేసులో ఇద్దరు మహిళలను పోలీసులు అదుపులోకి తీసుకుని శనివారం మీడియా ముందు ప్రవేశపెట్టారు. బంగారం దుకాణం యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి క్రైమ్ ఎస్ఐ వెంకటేశ్వరరావు బృందం సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ పి.శ్రీను తెలిపారు. ఫెర్రీరోడ్డులో ఉన్న మహిళలను విచారించి వారి వద్ద 9 గ్రాముల రెండు చెవి దిద్దులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వారు వీరులపాడు మండలం గోకరాజుపాలెంకు చెందిన బొజ్జగాని జ్ఞానమ్మ, గుంటూరు జిల్లా పెనమాకకు చెందిన తోకల రాజేశ్వరిగా గుర్తించారు. బంగారం దుకాణదారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ సూచించారు.

సవరణ

ది. 17-04-2023 సాక్షి దినపత్రిక, నందిగామ డివిజన్‌లో ప్రచురితమైన శ్రీరామ్ ఫైనాన్స్ లి. జగ్గయ్యపేట బ్రాంచి ప్రకటనలో ప్రాపర్టీ హోల్డర్ పేరు తాళ్ళ రమణ W/o. సాంబశివరాజా పేరుకు బదులుగా తాళ్ళ రమణ W/o. సాంబశివరావు గా పొరపాటున ప్రచురితమైనది. కావున క్లయింట్ పేరు 'తాళ్ళ రమణ W/o. సాంబశివరాజా'గా గమనించగలరు. రాయపూడి శ్రీనివాసరావు, అడ్వకేట్ & నోటరీ



